క్లుప్తంగా

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: సుశీల్ మీడియా ఎంటర్ టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం బహుభాషా గాయకుడు జేసుదాసు సినీ రంగ సేవలను గుర్తుచేసుకుంటూ నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. పోతర్లంక రవి పర్యవేక్షణలో గాయనీ గాయకులు సుశీల్‌కుమార్, భారతి, రమణి, సుజాత, చంద్రశేఖర్, ఆదిరాల జయప్రభు పలు చిత్రగీతాలను ఆలపించారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు కొప్పుల అశోక్ ఆనంద్, చింతకాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగర పాలకసంస్థ అధికారులు స్పందించారు. స్థానిక 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో యూజీడీ పనుల కోసం తవ్విన మ్యాన్‌హోల్స్ వద్ద వ్యర్థాలను శుక్రవారం తొలగించారు. ఇక్కడ యూజీడీ మ్యాన్‌హోల్ కోసం తవ్విన చోట పనులు పూర్తి అయిన కూడా వ్యర్థాలను తొలగించకపోవడంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి శుక్రవారం 'తవ్వి వదలివేస్తున్నారు..' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు మ్యాన్‌హోల్ వద్ద వదలివేసిన వ్యర్థాలను తొలగించడంతో పాటు గుంతలు పడిన ప్రాంతాలను సరిచేశారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

30 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 30 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 30 మందిపై 2వ, 4వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్లలో కేసులు నమోదుచేశారు. 30 మందిని కోర్టులో హాజరుపరచగా, ఆరవ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున, మిగిలిన 27 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ప్రమాదకరంగా గుంతలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే 30వ డివిజన్ రామకృష్ణాపురం గ్రంథాలయం సమీపంలో గుంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఇటీవల పైపులైన్ల పనుల్లో భాగంగా రోడ్డును తవ్వి పనులు పూర్తి చేశారు. అయితే తర్వాత రోడ్డును మాత్రం సరి చేయలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కృంగిపోయి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ తరచూ వాహనచోదకులు, పాదచారులు కిందపడి గాయాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా గ్రంథాలయానికి వచ్చే వృద్ధులు, చిన్నారులు గుంతల వల్ల తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): చెడు వ్యసనాలకు అలవాటు పడిన భర్త మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడని భార్య కర్రి రూతు చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక ఏవీఎస్ రెడ్డి రోడ్డుకు చెందిన రూతుకు గుంటూరు మంగళదాస్ నగర్‌కు చెందిన కర్రి వీరబాబుతో 2013లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. వీరబాబు చెడు వ్యసనాలకు అలవాటు పడి భార్యను తరుచుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 64వ డివిజన్‌లోని బర్మాకాలనీ, రాధానగర్, ప్రజాశక్తి నగర్, కండ్రిక కాలనీ సచివాలయాల పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శులతో కలిసి స్థానిక కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులు పింఛన్ల సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

మోసం.. చంద్రబాబు నైజం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ పోస్టర్‌లను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ నాయకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అధికారంలో ఉంటే ఒక మాట.. లేనప్పుడు ఒక మాట మాట్లాడటం చంద్రబాబు మోసపూరిత నైజం అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక 32వ డివిజన్, అయోధ్యనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' పేరుతో శుక్రవారం డివిజన్ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు అమలుకాని హామీలతో ప్రజలను ఏ విధంగా మోసం చేశారో క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ ధైర్యంగా వెళ్లి వారి కుటుంబంలో ఎంతమందికి లబ్ధిచేకూరిందో కాగితాల రూపంలో అందజేయడం జరిగిందని గుర్తుచేశారు. కాని కూటమి ప్రభుత్వంలో మాత్రం సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే ప్రతి ఇంటికి వెళ్లి 2024 జూన్ నుంచి కుటుంబంలో ఎంత వరకు లబ్ధిచేకూరుతుందో బాండ్ల రూపంలో ఇస్తూ ప్రజలను మధ్యపెట్టి చర్యలకు దిగిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఎంత వరకు ప్రజలు నష్టపోతున్నారో వారికి వివరించే దిశగా ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి చైతన్యవంతం చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అందజేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కూడా ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయకుండా సూపర్ సిక్స్ పథకాలు అన్నీ ఇచ్చేశామని చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

అమలుకాని హామీలతో వంచన

కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు అమలుకాని హామీలను ఊదరకొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని మల్లాది విష్ణు విమర్శించారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ తల్లికి వందనం అని, నిరుద్యోగులకు ప్రతి నెలా రూ. 3వేలు భృతి, 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1,500, ఉచిత బస్సు ప్రయాణం హామీలను పూర్తిగా వదిలేశారని పేర్కొన్నారు. ప్రజలు కూడా మోసపోయామని గుర్తించారని, రానున్న రోజుల్లో వారే ఈ కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుండె సుందర్‌పాల్, నాయకులు ఒగ్గు గవాస్కర్, జి.రంగారావు, శ్యామ్, త్రివేణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం – బనకచర్ల ప్రాజెక్టు లోపభూయిష్టం

- ఈనెల 4 నుంచి ప్రాజెక్టుల సందర్శన
- ఆలోచనపరుల వేదిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత లోపభూయిష్టమైన, రాష్ట్ర నీటి హక్కులకు ప్రమాదం తెచ్చిపెట్టే, కరవు పీడిత రాయలసీమకు తీవ్ర హానికరమైన పోలవరం - బనకచెర్ల భారీ ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించిందని ఆలోచనపరుల వేదిక విమర్శించింది. ఈ పథకాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేసింది. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆలోచనపరుల వేదిక ప్రతినిధులు టి. లక్ష్మీనారాయణ, అక్కినేని భవానీ ప్రసాద్, ఏబీ వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. పోలవరం బనకచర్ల అనుసంధాన పథకాన్ని తెలంగాణ రాజకీయ ఆయుధంగా మలుచుకుని ఏపీ నీటి హక్కులపై ముప్పేట దాడి చేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాలపై రాజకీయ ప్రేరేపిత వివాదం తీవ్ర స్థాయిలో కొనసాగుతోందన్నారు. ట్రిబ్యునల్ తీర్పులను, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఖాతరు చేయకుండా తెలంగాణలో నీళ్ల రాజకీయాన్ని తారస్థాయికి తీసుకెళ్లారన్నారు. తెలంగాణ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్ ద్వారా అసత్యాలతో ఏపీ నీటి హక్కులపై దాడి చేసినా కూటమి ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని ప్రాజెక్టుల పర్యటన చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 4న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, 5న శ్రీశైలం జలాశయం ఆధారంగా నిర్మించిన మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాలు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్, వెలుగోడు రిజర్వాయర్‌ను సందర్శిస్తామని తెలిపారు. ఈనెల 6న శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ (ఎస్సార్‌బీసీ) ప్రధాన రిజర్వాయర్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. అనంతరం కర్నూలులో రైతులు, పౌర సమాజంతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



ముత్యాలంపాడు రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయం, సత్యనారాయణపురం రైల్వే కాలనీలోని శ్రీశివకేశవ ఆలయం, రామకృష్ణాపురం శ్రీదుర్గాదేవి అమ్మవారి ఆలయం, అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం, మధురానగర్ స్వయంభూ శ్రీబాలసుబ్రహ్మణ్య స్వామివారి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రీతికరమైన శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు. మధురానగర్ బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. అలాగే మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రజల భాగస్వామ్యంతో పటిష్ట భద్రతా చర్యలు

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల భాగస్వామ్యంతో ప్రజల రక్షణకు..ట్రాఫిక్ భద్రతకు మరింత పటిష్ట చర్యలు చేపట్టవచ్చని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా అన్నారు. సింగ్‌నగర్ నందమూరినగర్ ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త గోపి అప్పారావు నగర పోలీస్ విభాగానికి డ్రోన్ కెమెరాను బహూకరించారు. ఈ నేపథ్యంలో డీజీపీ చేతుల మీదుగా గోపి అప్పారావును నగర పోలీసులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు. సామాజికబాధ్యతగా అప్పారావు నగర పోలీసులకు విలువైన డ్రోన్ కెమెరాను అందజేసి ప్రజాభద్రతలో భాగస్వామి కావడం అభినందనీయమన్నారు. మరింత మంది దాతలు సమాజసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ నరమేధం ఆపాలి

ఇస్లామిక్ విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పాలస్తీనా, గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధం ఆపాలని ఇస్లామిక్ విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్(ఎస్ఐఓ) ఆధ్వర్యంలో పాలస్తీనాకు మద్దతుగా ధర్నా జరిగింది. ధర్నాలో ఇఫ్టూ, కాంగ్రెస్, విద్యార్థి ప్రజా సంఘాల నేతలు పాల్గొని మద్దతు పలికారు. ధర్నాలో పాల్గొన్న జమాతే ఇస్లామిక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించారు. దాడులతో పాలస్తీనా, గాజా పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఇజ్రాయిల్‌కు అంతర్జాతీయ సమాజం తగిన శిక్ష విధించాలన్నారు. పాలస్తీనా, గాజాలో శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ స్పందించి పాలస్తీనాకు మద్దతు పలకాలన్నారు. ధర్నాలో ఇఫ్టూ రాష్ట్ర నాయకులు ప్రసాద్, నరహరిశెట్టి నరసింహారావు, ఎస్ఐఓ, జమాతే ఇస్లామిక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఆర్‌కే స్టేడియంలో రైఫిల్ షూటింగ్‌కు సిద్ధం చేయండి



సీఆర్‌కే స్టేడియం పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, స్పోర్ట్స్-ఎస్టేట్స్ అధికారి శ్రీధర్

పటమట(విజయవాడతూర్పు): పటమట చెన్నుపాటి రామకోటయ్య (సీఆర్‌కే) స్టేడియంలో రైఫిల్ షూటింగ్ కోసం ప్రణాళికను సిద్ధం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం బందరు రోడ్డులోని దండమూడి రాజగోపాలరావు(డీఆర్‌ఆర్) ఇండోర్ స్టేడియం, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో రైఫిల్ షూటింగ్ విభాగానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. నగర పరిధిలో గల అన్ని స్టేడియాల్లో మరమ్మతులు ఏమైనా చేయాల్సి ఉంటే వెంటనే వాటిని సరిచేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పర్యటనలో డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి – ఎస్టేట్ ఆఫీసర్ డాక్టర్ ఎ.శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పాఠశాలలను జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు శుక్రవారం తనిఖీ చేశారు. సూర్యారావుపేటలోని ఎస్‌కేఆర్‌ఎంఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌కు శుక్రవారం మధ్యాహ్నం వెళ్లి విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల హ్యాండ్‌బుక్‌లను పరిశీలించి పాఠ్యాంశాల బోధన, ఇతర అంశాలపై చర్చించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

పీజీ, డిగ్రీ ప్రవేశాలను వెంటనే చేపట్టాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలో పీజీ, డిగ్రీ ప్రవేశాలు వెంటనే చేపట్టాలని అఖిల భారత రాష్ట్రీయ సైకిక్ మహా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, డాక్టర్ డీఎస్‌వీఎస్ బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు వినతి పత్రం పంపించామని తెలిపారు. మామూలుగానే అంతంత మాత్రంగా ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ ఇంతవరకు ఇవ్వకపోవడం వల్ల అనేకమంది విద్యార్థులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల ప్రవేశాల్లో ఆలస్యం అవుతున్నందు వల్ల అనేక మంది విద్యార్థులు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, ఇతర రాష్ట్రాల్లోని కళాశాల వైపు వెళ్లిపోతున్నారని అన్నారు. పీజీ సెట్ నిర్వహించి ఫలితాలు విడుదల చేసినప్పటికీ ప్రవేశాలను చేపట్టకపోవడం విచారకరమని పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైన ఘటనపై శుక్రవారం నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాయకాపురం వాంబే కాలనీకి చెందిన చిటికెల నాగలక్ష్మికి ముగ్గురు కుమార్తెలు. రెండవ కుమార్తె తొమ్మిదవ తరగతి చదివి ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటుంది. గత నెల 31వ తేదీ రాత్రి 8గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దోమల నిర్మూలనకు ఫ్రైడే - డ్రైడే



పటమట(విజయవాడతూర్పు): దోమల నిర్మూలనకు వీఎంసీ కృషి చేస్తుందని, దీనికి నగరవాసులు సహకారం అందించాలని వీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ అర్జునరావు అన్నారు. ఫ్రైడే - డ్రైడే సందర్భంగా ఆయన శుక్రవారం 40 డివిజన్‌లోని, గాంధీబొమ్మ సెంటర్, విద్యాధరపురం, ప్రభుత్వ బాలికల హాస్టల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతకమైన డెంగీ వ్యాధిని కలిగించే ఈడీస్ దోమ, ఇంటి పరిసరాల్లోని చిన్న చిన్న నీటి వనరుల్లో ఉంటుందని చెప్పారు. మూతలు లేని నీటి నిల్వల్లో అనాఫిలస్ దోమ గుడ్లు పెట్టి వృద్ధి చెందుతుందని, ఇది మలేరియా వ్యాధి కారకమవుతుందని వివరించారు. తొలుత ఆయన జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో నగరపాలక సంస్థ బయాలజిస్ట్ కామేశ్వరరావు, సహాయ వైద్యాధికారి అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్, మలేరియా ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది, సబ్ యూనిట్ ఆఫీసర్ పర్యవేక్షణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవాత్మక ఆటో మ్యుటేషన్ సేవలకు శ్రీకారం

కలెక్టర్ డా. లక్ష్మీశ



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆటో మ్యుటేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటో మ్యుటేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకమయ్యాయని.. ఇదో విప్లవాత్మక మార్పు అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. రాష్ట్రంలోని 17 మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో శుక్రవారం ఆటో మ్యుటేషన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎంతో కలిసి నగరంలోని గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మ్యుటేషన్ అవుతున్న ప్రక్రియను పరిశీలించారు. నగరంలోని చిట్టినగర్‌కు చెందిన నంబూరు సామ్రాజ్య లక్ష్మి కొనుగోలు చేసిన రెసిడెన్షియల్ ఆస్తి రిజిస్ట్రేషన్, ఆటో మ్యుటేషన్ ప్రక్రియను స్టెప్ – 1 మొదలు స్టెప్ – 7 వరకు చివరగా మ్యుటేషన్ సర్టిఫికేట్ జనరేట్ అయ్యేంత వరకు ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియ మొత్తం అరగంటలో పూర్తి చేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర లబ్ధిదారుకు మ్యుటేషన్ సర్టిఫికేట్ అందజేశారు.

పారదర్శకంగా సేవలు

అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ కొత్త విధానంలో ఒకేరోజు ఒకే చోట చాలా తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్‌తో పాటే తక్షణ మ్యుటేషన్ జరుగుతుందని చెప్పారు. మునిసిపల్ డేటా బేస్‌లో ఆటోమేటిక్‌గా యజమాని పేరు మారిపోతుందని వివరించారు. ఆటో మ్యుటేషన్ వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. డాక్యుమెంటేషన్ వర్క్ తగ్గడమే కాకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందుతాయన్నారు. రిజిస్ట్రేషన్, మునిసిపల్ డిపార్టుమెంట్ల డేటాబేస్ అనుసంధానంతో సరళీకృత సేవలు లభిస్తాయన్నారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ పట్టణ డిజిటల్ పాలనలో ఇదొక మైలురాయి అన్నారు. 64 డివిజన్ల ప్రజలు అవగాహన పెంచుకొని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎ.రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్, సబ్ రిజిస్ట్రార్లు ఎండీ ఆరిఫ్, కె.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రి ప్రసూతి విభాగంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పుట్టిన అర్ధగంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. బిడ్డకు వయస్సు ఆరు నెలలు వచ్చే వరకూ తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతపై వారం రోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రసూతి విభాగంలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పరుచూరి అనిల్‌కుమార్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కేశవచంద్ర, సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మావతి తదతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు పండ్లు, పోషక ఆహారం పంపిణీ చేశారు.

907 కేజీల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ స్వాధీనం

రూ.3.50 లక్షల జరిమానా



ప్లాస్టిక్ హోల్‌సేల్ షాపుల్లో తనిఖీలు చేస్తున్న వీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో నిషేధంలో ఉన్న సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయించిన వ్యాపారస్తులపై దాడులు నిర్వహించి వారి వద్ద 908.83 కేజీల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా వ్యాపారస్తులకు రూ.3.50 లక్షల జరిమానా విధించామని వీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ అర్జునరావు ఆధ్వర్యంలో మూడు సర్కిళ్ల పరిధిలో జూలై 25 నుంచి జూలై 31 వరకు ఈ దాడులు జరిగాయని పేర్కొన్నారు. సర్కిల్-1లో 3 టీములు, సర్కిల్-2 లో 3 టీములు, సర్కిల్- 3లో 4 టీములు ఈ తనిఖీలు నిర్వహించాయని తెలిపారు.

కార్పొరేషన్‌లోనూ తనిఖీలు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా విజయవాడ నగరపాలక సంస్థ ఉండాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఆ మేరకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కచ్చితంగా నిషేధించాలని సిబ్బందికి అవగాహన కల్పించారు. విజయవాడ నగరవాసులు బయోడీగ్రేడబుల్ కవర్లు మాత్రమే వాడాలని చెప్పారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ అమ్మకంపై మొదటిసారి హోల్‌సేల్ షాప్‌లపై జరిమానా విధిస్తామని, రెండోసారి దానికి రెట్టింపు, మూడోసారి షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

స.హ చట్టంపై ఎన్‌ఆర్‌సీ స్థాయి పోటీలు



పోటీల్లో గెలుపొందిన వారితో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కళాశాల విద్య డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు నోడల్ రిసోర్స్ సెంటర్ స్థాయి వ్యాసరచన, వకృత్వ, డిబేట్, క్విజ్ పోటీలను ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం 2005పై ఈ పోటీలను కళాశాల స్థాయిలో మొదటి స్థానంలో గెలుపొందిన విజేతలకు ఎన్‌ఆర్‌సీ (జిల్లాస్థాయి) లెవెల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్యామ ఖాన్ వ్యాసరచన, షారును వకృత్వం, రెజీనా ఫాతిమా డిబేట్, చక్రధర్, సంతోష్, తస్లీమ్‌లు క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచారని ఎన్‌ఆర్‌సీ స్థాయి పోటీల కన్వీనర్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన అధ్యాపకులు కె. రమేష్, డి. యుగంధర్, అప్పారావు, అజయ్‌బాబు, ప్రకాశం, దాస్, చంద్రశేఖర్, మల్లేశ్వరమ్మ, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న చెట్లతీగలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 28వ డివిజన్ రాజేశ్వరి వీధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఇటీవల కురిసిన వర్షాలకు చెట్లు, పొదులు విపరీతంగా పెరిగిపోయాయి. చెట్ల తీగలు, ఆకులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వరకు చేరుకున్నాయి. పట్టించుకోవాల్సిన విద్యుత్‌శాఖ సిబ్బంది కనీసం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గం మీదుగానే నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఎవరైనా చెట్ల తీగలను తాకితే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు, వర్షాలు పడినప్పుడు ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు సైతం వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పానిక చెట్ల ఆకులు, తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.